మర్రి గెలుపులో జమునమ్మ ముందడుగు

నాగర్‌కర్నూల్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి విజయంలో ముందడుగేస్తున్నారు. సతివెంట పతి అనే సామెతకు భిన్నంగా ఎమ్మెల్యే మర్రి రాజకీయ జీవితంలో అన్నీ తానై ముందే ఉంటున్నారు మర్రి జమునమ్మ. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి 2012లో రాజకీయాల్లోకి అడుగు పెట్టినప్పటి నుంచి ఈ ఎన్నికల ప్రచారం వరకూ జమున వెన్నంటే ఉంటున్నారు. ఎంజేఆర్ ట్రస్టు డైరెక్టర్ గానూ ఉన్న జమున సామూహిక వివాహాలు, నిరుద్యోగ యువతకు శిక్షణలు, రూ.5కి భోజనం పథకంలాంటి ఎమ్మెల్యే చేసే సామాజిక సేవలో భాగంగా ఉంటున్నారు. అర్ధనారీశ్వరులకు ప్రతిరూపం అనిపించేలా ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాల్లో హాజరవుతూ ప్రజల్లో కలిసిపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భార్యగా కాకుండా పొరుగింటి ఆడపడుచులా ప్రజలతో కలిసిపోతున్నారు. ఎంతో డబ్బున్న మహిళ అనే డాబూ, దర్పం కనిపించకుండా జమునమ్మ వ్యవహరించే తీరు ప్రజలను ఆకర్షిస్తున్నది. ప్రసంగాలూ, ఇతరులను ఒప్పించడంలో జమున నేర్పరి తనం ఎమ్మెల్యేకు సగం బలంగా మారుతున్నాయి. నాయకులు, కార్యకర్తల ఇండ్లల్లో కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ వస్తున్నారు. ఒకానొక దశలో తన రాజకీయ అదృష్ట జాతకం సతీమణి జమున అని ఎమ్మెల్యే స్వయంగా చెప్పడం కూడా విశేషం. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 50కిపైగా గ్రామాల్లో మర్రి జమున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం బయలుదేరి రాత్రి పదింటికి ఇంటికి చేరేదాకా ప్రచారంలోనే ఉంటున్నారు. గ్రామాల్లో తాను గుర్తించిన సమస్యలను, ప్రజల ఆకాంక్షలను ఎమ్మెల్యేకు వివరిస్తూ పరిష్కరించేలా జమున పని చేస్తున్నారు. దీనివల్ల జమునమ్మకు చెప్పినా తమ పని అవుతుందనే నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో నెలకొంది. అలాగే మర్రి కుమారుడు మర్రిశశిధర్‌రెడ్డి సైతం ప్రచారంలో దూసుకుపోతున్నారు. తండ్రి గెలుపే లక్ష్యంగా ప్రజల్లో మమేకమవుతూ పదేండ్లలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కారుగుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. అలాగే మర్రి సోదరుడు వెంకట్‌రెడ్డి సైం ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్ గెలుపునకు పాటుపడుతున్నారు.

నాగర్‌కర్నూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మర్రి సతీమణి జమున (ఫైల్)

గడపగడపకూ గువ్వల అమల

అచ్చంపేట, నవంబర్ 14 : అచ్చంపేటలో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు జీబీఆర్ చారిటబుల్ ట్రస్టు గువ్వల అమల గడపగడపకూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అచ్చంపేటలో మూడోసారి గులాబీ పార్టీని గెలిపించడమే లక్ష్యం గా ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి గువ్వల అమల తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 15రోజులుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ ఇప్పటికే చాలా గ్రామాల్లో పర్యటించారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి పనులు, ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలను కలిసి ప్రభుత్వం వారి కోసం చేస్తున్న కృషిని వివరిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి మహిళలతో ముచ్చటిస్తూ మూడోసారి అచ్చంపేటలో గువ్వల బాలరాజును గెలిపించాలని కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం మహిళలతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు. గువ్వల బాలరాజు పని తీరు, అచ్చంపేట అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. గువ్వల బాలరాజు గెలుపు కోసం ఆయన సతీమణి గువ్వల అమల నిరంతరం శ్రమిస్తున్నారు. అంతేకాకుండా గువ్వల బాలరాజు తమ్ముడు రమేశ్ నియోజకవర్గంలో యువతతో కలిసి అన్న గెలుపు కోసం ఎంతో కృషి చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రం తోపాటు గ్రామాల్లో యువతను ఆకర్షిస్తూ తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

అచ్చంపేట మండలంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తమ్ముడు రమేశ్ (ఫైల్)

అచ్చంపేటలో ప్రచారం చేస్తున్న గువ్వల అమల (ఫైల్)

అండగా ఉంటాం.. ఆదరించాలి

కొల్లాపూర్, నవంబర్ 14 : కొల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత 28వ తేదీన చిన్నంబావి మండలంలో ప్రచారాన్ని ప్రారంభించి ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకటరమణమ్మలతో కసి గడపగడపకూ వెళ్లి బీర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి మహిళా ఓటరును కలిసి నుదిటిన తిలకం పెట్టి మన్ననలను చూరగొంటున్నారు. బీరం విజయమ్మకు ఎన్నికల ప్రచారంలో మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాలను గురించి మహిళలకు ఆమె వివరించి కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొల్లాపూర్ మండలం సున్నపుతండాలో పర్యటించారు. అలాగే నియోజకవర్గంలో గ్రామాల్లో పర్యటిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా సతీమణితో పాటు తల్లి బీరం బిచ్చమ్మ, అక్కలు ఉమాదేవి, వీణలు నియోజకవర్గంలో పర్యటిస్తూ కారుగుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.

ఎమ్మెల్యే బీరానికి మద్దతుగా ప్రచారం చేస్తున్న తల్లి బిచ్చమ్మ

ప్రచారంలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే బీరం సతీమణి విజయమ్మ

తండ్రి కోసం తనయుడి ప్రచారం

●ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్‌రెడ్డి ప్రచారం

జడ్చర్ల, నవంబర్ 14 : జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తరపున తనయుడు స్వరణ్‌రెడ్డి జడ్చర్ల నియోజకవర్గంలో పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలను కలుస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ఆగం కావద్దని, సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే మళ్లీ గోసపడుతామని చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలతో మమేకమై ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తనయుడు స్వరణ్‌రెడ్డి

ప్రచారంలో దూసుకుపోతున్న ఆల మంజుల

మూసాపేట, నవంబర్ 14 : దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గత 28 రోజుల నుంచి అమె నిరంతరంగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని 70తండాలు, 13 గ్రామాల్లో ప్రచారం పూర్తి చేశారు. గ్రామాలకు ప్రచారానికి వెళ్లిన ఆమెకు ఆయా గ్రామాల్లో మహిళలు, పార్టీశ్రేణులు ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రచార సమయంలో మహిళలు, ప్రజలు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్తూ, హోటళ్లలోకి వెళ్లి పూరీలు, బజ్జీలు చేస్తూ, పిల్లలను ఎత్తుకొని తల్లిదండ్రులతో ముచ్చటిస్తూ సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఎమ్మెల్యే ఆల కూతురు ఆల ప్రీతి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి యువతీ, యువకులతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాలను వివరిస్తూ, ప్రగతిని చూసి ఓటు వేయాలని కోరుతున్నారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల కూతురు ప్రీతి

ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆల సతీమణి మంజుల (ఫైల్)

పతి గెలుపే లక్ష్యంగా..

- నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న బండ్ల జ్యోతి
- ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ..
- మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం

సిద్దోనిపల్లి తండావాసులతో ఎమ్మెల్యే బండ్ల సతీమణి జ్యోతి (ఫైల్)

గద్వాల, నవంబర్ 14 : గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ఆయన సతీమణి బండ్ల జ్యోతి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. గత నెల 15 తేదీన ధరూర్ మండలం చిన్నచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు ఎమ్మెల్యే ఐదేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ అందుకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. పల్లెల్లో కాలినడకన వెళ్తూ వృద్ధులు, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. గ్రామాల నడిబొడ్డున సమావేశమై ఆయా ప్రాంతాల్లో చేసిన అభివృద్ధిని వివరిస్తున్నారు. ధరూర్ మండలంలో భీంపురం, చింతరేవుల, ఎములోనిపల్లి, రేవుల పల్లి, నర్సన్‌దొడ్డి, ఉప్పేర్, గార్లపాడు, నాగర్‌దొడ్డి, నెట్టెంపాడ్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం కేటీదొడ్డి మండలంలో ప్రచారం నిర్వహించారు. తండాలకు వెళ్లిన సమయంలో వారి వేషధారణలో ఆడుతూ పాడుతూ ప్రచారం నిర్వహించారు. కేటీదొడ్డి మండలం లో మల్లాపురం,మల్లాపురంతండా, కుచినెర్ల, చింతలకుంట, గువ్వలదిన్నె, సిద్దోనిపల్లి, తూర్పుతండా, పూజారితండా, కొండాపురం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గత ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డి తరపున నియోజకవర్గమంతటా ఇంటింటికీ తిరిగి భర్త గెలుపునకు కృషి చేశారు. ఈ ఎన్నికల్లో నూ భర్త గెలుపు కోసం మహిళా సంఘాలతో సమావేశం, గర్భిణులకు సీమంతం కార్యక్రమాలు నిర్వహిస్తూ మందుకు సాగుతున్నారు. అదేవిధంగా బండ్ల గెలుపు కోసం ఆయన తనయుడు సాయిసాకేత్‌రెడ్డి ఇంటింటికీ కృష్ణన్న పేరుతో గ్రామాల్లో పర్యటిస్తున్నారు. నది అగ్రహారం నుంచి ప్రచారాన్ని ప్రారంభించి గద్వాల మండలమంతా పర్యటించారు. ఈక్రమంలో ఐదేండ్లలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధిని వివరిస్తూ తయారుచేసిన అభివృద్ధి కరపత్రాలను కూడా పంపిణీ చేస్తున్నారు. యువకులతో బృందాన్ని ఏర్పాటు చేసుకొని ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం సాయిసాకేత్‌రెడ్డి పర్యటన గట్టు మండలంలో కొనసాగుతున్నది.

వృద్ధులను కలిసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల తనయుడు సాకేత్‌రెడ్డి